క్లుప్తంగా

డ్రెయినేజి కార్మికులు పేర్లు నమోదు చేసుకోవాలి

నెహ్రూ నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ నెల 12 నుంచి 14వ తేదీలోగా నమస్తే పథకంలో పేర్లు నమోదు చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలోని సెప్టిక్ ట్యాంక్, భూగర్భ డ్రెయినేజి కార్మికులు తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అందించడానికి వీలు కలుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9505378036(ఎస్ఎస్టీం)లో సంప్రదించాలని సూచించారు. నిర్దేశిత అనుమతులు, పర్యవేక్షణ లేకుండా భూగర్భ డ్రెయినేజీలోకి ప్రవేశించడానికి శిక్షణ లేని వ్యక్తులను నియమించడం చట్టవిరుద్ధమని చెప్పారు. అటువంటి కార్మికులను నియమించుకున్న వ్యక్తి, సంస్థపైన భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఉచిత ఆరోగ్య శిబిరం

గుంటూరు లీగల్: స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉచిత ఆరోగ్య శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరాన్ని ఎండో లైఫ్ హాస్పిటల్, కోనేక్ డయాగ్నటిక్స్ ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో గుంటూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాసు వెంకటరెడ్డి పాల్గొన్నారు. కోనాక్ ఎండో లైఫ్ హాస్పిటల్ డాక్టర్ శ్రీకాంత్ కొంగర, ఎండో క్రైనాలజిస్ట్, సీఈఓ చలపతి, మేనేజర్ రామాంజనేయులు పర్యవేక్షించారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం



గుంటూరు ఎడ్యుకేషన్: పొట్టి శ్రీరాములునగర్ మెయిన్‌రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవేంకటేశ్వరస్వామిని విశేషంగా అలంకరించిన ఆలయ అర్చకులు వైభవంగా కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం కల్యాణ మూర్తుల ఊరేగింపు కార్యక్రమంలో మహిళలు, బాలికలు కోలాట ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

ఘంటసాల తెలుగు జాతికే గర్వకారణం



లక్ష్మీపురం: లలిత సంగీత ప్రపంచంలో గాయకుడిగా కొట్లా తెలుగు ప్రజల గుండెల్లో గూడు కట్టుకుని సుస్థిర స్థానం సంపాదించిన ఘంటసాల అని రంగ స్థల నటుడు, పి.ఘనశ్యామ చార్యులు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం ఘంట సాల వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

జాతీయ జిమ్నాస్టిక్స్ పోటీల్లో షేక్ యాసిన్‌కు బంగారు పతకం



లక్ష్మీపురం: జాతీయ జిమ్నాస్టిక్స్‌లో గుంటూరుకు చెందిన షేక్ యాసిన్ బంగారు పతకం కైవసం చేసుకున్నట్లు రాష్ట్ర జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో నిర్వహిస్తున్న 38వ జాతీయ జిమ్నాస్టిక్స్ పోటీలలో ప్రతిభ చాటినట్లు చెప్పారు. నూతన క్రీడా నిబంధనల ప్రకారం జాతీయ క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు అందే అవకాశం ఉందని వివరించారు. పేద కుటుంబంలో జన్మించిన గుంటూరుకు చెందిన యాసిన్, ఎంతో కఠోరమైన శిక్షణ పొంది జిమ్నాస్టిక్స్‌లో చిన్న వయస్సులోనే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో బంగారు పతకం దక్కించుకోవడం గర్వకారణంగా పేర్కొన్నారు. బాలికను జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్లా వెంకటేశ్వరరెడ్డి, కొసనా వేణుగోపాల్‌రావు అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

లక్ష్మీపురం: టెంట్ హౌస్ గోడౌన్‌లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి మంగవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ కుత్బుల్లాపూర్‌కు చెందిన యారారం నరేష్(36), గుంటూరు శారదాకాలనీ 7వ లైన్‌లోని టెంట్ హౌస్ గోడౌన్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గోడౌన్‌లో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటాడు. అయితే రోజు మాదిరిగానే పని పూర్తి చేసుకున్న నరేష్‌ను మంగళవారం ఉదయం వచ్చి చూసే సరికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వీఆర్ఓ వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మానస వేదన

ఆహ్లాదం.. అందనంత దూరం
- అస్తవ్యస్తంగా మానస సరోవరం
- 50 ఎకరాల పార్కు నిరుపయోగం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని సర్కారు



ఎన్టీఆర్ మానస సరోవరం ప్రారంభోత్సవ స్థూపం



తాళాలు వేసి ఉన్న ఎన్టీఆర్ మానస సరోవరం గేటు



గడ్డి, పిచ్చిమొక్కలతో ఉన్న వాటర్ ఫౌంటెయిన్



శిథిలావస్థకు చేరిన కాటేజీలు

పెదకాకాని: చెంగుచెంగున గంతులేసే జింకలు మాయమయ్యాయి. మాట్లాడే చిలుకల పలుకులు మూగబోయాయి. సుందరమైన కాటేజీలు గుబురు చెట్లమధ్య వెలవెలబోతున్నాయి. బోటు షికారు, గుర్రపు స్వారీ కనుమరుగయ్యాయి. రంగురంగు విద్యుత్ కాంతుల్లో నీటిని విరజిమ్మిన వాటర్ ఫౌంటెయిన్‌లు తుప్పుపట్టాయి. ఇదీ గుంటూరు నగర శివారులో ఒకప్పుడు పర్యాటకులతో కళకళలాడిన ఎన్టీఆర్ మానస సరోవరం ప్రస్తుత దుస్థితి. పార్కు మొత్తం అస్తవ్యస్తంగా తయారైంది. రూ.కోట్లాది రూపాయల విలువైన భూమి చిట్టడవిని తలపిస్తోంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా అవుతోంది. పాలకులు, అధికారుల చిన్నచూపే దీనికి కారణం. ఈ పార్కును మళ్లీ పర్యాటకేంద్రంగా తీర్చిదిద్దిగలిగితే గుంటూరు జిల్లాలోనే ప్రత్యేక ఆహ్లాదకరమైన ప్రదేశాలలో ఒకటిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

గబ్బిలాలు, కోతులకు నిలయం

గుంటూరు కార్పొరేషన్ పరిధిలోని పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామ శివారులో 1999 ఏప్రిల్ 25న డాక్టర్ నందమూరి తారకరామారావు మానస సరోవరం పేరుతో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి పక్కనే ఆధునిక హంగులతో నిర్మించడంతోపాటు పర్యాటకులను విశేషంగా ఆకర్షించింది. దీనిలో 5 ఎకరాల భూమిని వాటర్ వరల్డ్ నిర్వాహకులకు లీజుకు ఇవ్వడంతో పార్కు దినదినాభివృద్ధి చెందింది. 2014–2019 మధ్య టీడీపీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల పార్కు అస్తవ్యస్తమైంది. గబ్బిలాలకు, కోతులకు నిలయమైంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పార్కులో ఏర్పాటు చేసిన నిర్మాణాలు శిథిలావస్థకు చేరాయి. బోటు షికారు కోసం తవ్విన చెరువు గడ్డి, గుర్రపుడెక్కతో పూడిపోయింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మానస సరోవరాన్ని ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు. చిన్నపిల్లల ఆడుకునేందుకు ఆటవస్తువులతోపాటు యువకులు, పెద్దల వ్యాయామానికి పరికరాలు ఏర్పాటు చేయాలని, ఉదయం, సాయంత్రాలు వాకింగ్ కోసం ట్రాక్ నిర్మించాలని కోరుతున్నారు.

డబ్బులు ఇప్పించాలంటూ మిర్చి రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

కొరిటెపాడు(గుంటూరు): మిర్చి అమ్మకం డబ్బులు ఇప్పించాలంటూ పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం గ్రంధసిరి గ్రామానికి చెందిన బాధిత మిర్చి రైతులు మంగళవారం మిర్చి యార్డు ఆవరణలోని పరిపాలన కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధిత మిర్చి రైతులు మాట్లాడుతూ గత ఏడాది మిర్చి సీజన్‌లో విజయ భాస్కర్ ట్రేడర్స్ మిర్చి కమీషన్ షాపు నిర్వాహకులు గోపు శ్రీనివాసరెడ్డి, సగిలి కిషోర్‌రెడ్డిలకు రూ.50 లక్షల విలువైన మిర్చి బస్తాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఐదుగురుకి ఒక్కొక్కరికి రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.50 లక్షలు ఇవ్వాలన్నారు. ఏడాది పాటు అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం అంటూ.. కాలం వెల్లబుచ్చుకుంటూ వచ్చారన్నారు. ఇప్పటికే గుంటూరు లాలాపేట, సత్తెనపల్లి పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం జరిగిందని వివరించారు. సంవత్సర కాలంగా డబ్బుల కోసం తిరుగుతున్నా తప్పించుకుని తిరుగుతున్నారని మండిపడ్డారు. తమకు రావాల్సిన డబ్బులు తమకు ఇవ్వాలని, డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్యలు చేసుకోవడమే శరణ్యమని హెచ్చరించారు. అనంతరం మిర్చి ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రికకు రైతులు కోటేశ్వరరావు, కోటపాటి నరసింహారావు, కోటపాటి నాగేశ్వరరావు, పరుచూరి ప్రతాప్, కిలారి నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు.

తైక్వాండోలో సత్తా చాటిన బాలికలు



విద్యార్థినులతో పాటు కోచ్ కాశీనాథ్‌రెడ్డిని అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థినులు సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు.

లక్ష్మీపురంలోని పాఠశాలలో మంగళవారం విద్యార్థినులకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 28, 29, 30వ తేదీల్లో హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఏడో జాతీయస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ 2024–25 పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని బి.హర్షవర్ధని రెడ్డి అండర్ –14 క్యాడేట్(ఓవర్ 59 కేజీలు) ఆరో తరగతి విద్యార్థిని బి.రమ్యశ్రీ, అండర్– 12 క్యాడేట్ (37 కేజీలు)లో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారని వివరించారు. విద్యార్థినులకు మెరుగైన శిక్షణ కల్పిస్తున్న కోచ్, వీరి తండ్రి అయిన బి.కాశీనాథ్ రెడ్డి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. యుద్ధకళ అనేది ఆత్మగౌరవం, ఆత్మ రక్షణ జ్ఞానం, మానసిక, శారీరక శ్రేయస్సు పెంచడానికి దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు గారు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కోఆర్డినేటర్స్ దుర్గా శ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

శ్రీ హాస్పిటల్‌తో ఎస్ఆర్ఎం వర్సిటీ ఎంఓయూ



ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సమిష్టా హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(శ్రీ) హాస్పిటల్ యాజమాన్యంతో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మంగళవారం ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకుంది. బయోలాజికల్ పరిశోధన, వ్యాధి నిరోధక పరీక్షల నిర్వహణ, క్లీనికల్ ఫేజ్ థెరపీ, లేబొరేటరీ సదుపాయాల కల్పన, వర్క్‌షాపుల నిర్వహణ వంటి అంశాలలో రెండు సంస్థల మధ్య సమగ్రమైన ఒప్పందం కుదిరినట్లు శ్రీహాస్పిటల్‌కు చెందిన ప్రఖ్యాత ఇన్ఫెక్షన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ కోగంటి కళ్యాణ్‌చక్రవర్తి తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేశారు. రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం వల్ల బయోలాజికల్ రీసెర్చి అభివృద్ధి జరుగుతుందని యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర సుదర్శన్ గోవిందరాజన్ అభిప్రాయపడ్డారు. శ్రీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ సందీప్, డాక్టర్ రవితేజ, యూనివర్సిటీకి చెందిన డీన్ డాక్టర్ సీవీ టామి, ప్రొఫెసర్ రంజిత్ థాపా(రీసెర్చి) డాక్టర్ జయశీలన్, డాక్టర్ అనిల్ కె.సురేష్ పాల్గొన్నారు.

దాడి చేసి బెదిరించిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: భార్యాభర్తల మధ్య మనస్పర్ధలతో దాడి చేసి, బెదిరించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన సోమవారం రాత్రి చేసుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. బ్రాడీపేటకు చెందిన సాయికుమార్ కుమార్తె దివ్యతో రెండు సంవత్సరాల క్రితం రాజు అనే వ్యక్తితో వివాహం అయింది. వీరువురికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య రెండు నెలలుగా మనస్పర్ధల కారణంగా విడివిడిగా ఉంటున్నారు. రాజు సోమవారం రాత్రి కుమారుడిని చూసేందుకు భార్య ఇంటి వద్దకు వచ్చాడు. దివ్య తండ్రి సాయికుమార్‌కు రాజుకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో రాజు, సాయికుమార్ తలపై కొట్టి గాయపరిచాడు. దివ్య సోదరుడు వెంకటేష్ అడ్డు వెళ్లగా అతడిని కొట్టి హతమార్చుతానని బెదిరించాడు. దీంతో స్థానికులు గమనించి ఇరువురిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మంగళవారం సాయంత్రం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుబజారు.. లక్ష్యానికి దూరం

- కనీస మౌలిక సౌకర్యాలు లేక అవస్థలు
- ఇప్పటికి తాగునీరు, విద్యుత్ సరఫరాలేదు..
- రేకులషెడ్‌కు రంధ్రాలు, పగుళ్లు



రైతుబజారు పరిస్థితి



ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకం

నగరంపాలెం: రైతుబజార్‌కు సమస్యల సుడిలో చిక్కుకుంది. ఎన్నో ఏళ్ల నుంచి మౌలిక వసతులకు నోచుకోవడం లేదు. రైతులు, వినియోగదారులకు లాభం చేకూర్చే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన రైతు బజార్ వెలవెలబోతోంది. ఒకప్పుడు పాల ఆస్పత్రి ఎదురు రైతు బజారంటే ఎంతో పేరుంది. కానీ నిర్లక్ష్యంతో ప్రజల ఆదరణ కోల్పోతోంది.

ఎన్నో ఏళ్ల కిందట

తూర్పు నియోజకవర్గ పరిధిలోని పాల ఆస్పత్రి ఎదురు కూరగాయల మార్కెట్(రైతు బజార్) ఏర్పాటు చేశారు. అప్పటి రాష్ట్ర పురపాలక శాఖమంత్రి బండారు సత్యనారాయణమూర్తి రైతు బజార్‌ను ప్రారంభించారు. సుమారు 40 దుకాణాలు ఇక్కడ అందుబాటులోకి తీసుకొచ్చారు. తొలినాళ్లల్లో మార్కెట్ కొనుగోళ్లదారులతో కిక్కిరిసేది.

ఏఏ ప్రాంతాల వారు..

ఆనందపేట, ఇస్రాయేల్‌పేట, చిన్నబజార్, లాలాపేట, బరామాపంజా, పాతగుంటూరు, సంగడిగుంట, నల్లచెరువు తదితర ప్రాంతాల ప్రజలు వినియోగించుకునేవారు. తాజా కూరగాయలతో పాటు తక్కువ ధరలకు లభ్యమవుతుండడంతో ఆదరణ పెరిగింది. రానురాను రైతుబజార్‌ను పాలకులు, మార్కెటింగ్ శాఖ, జీఎంసీ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో కొనుగోళ్లదారుల సంఖ్య క్రమేణా తగ్గుతోంది.

విద్యుత్ సౌకర్యం లేదు..

ఇక్కడ రైతుబజార్‌లో కనీస మౌలిక సౌకర్యాల్లేవు. మొదట్నుంచి తాగునీరు, విద్యుత్ సరఫరా లేదు. దుకాణదారులంతా గుంటూరు రూరల్ పరిధిలోని యనమదల, పొత్తూరు, చౌడవరం తదితర గ్రామాలతో పాటు గుంటూరు నగరానికి చెందిన వారు ఉన్నారు. జిల్లా కు దగ్గరగా ఉన్న గ్రామాల్లో పండిన తాజా కూరగాయలను తీసుకువచ్చి విక్రయాలు జరుపుతుంటారు. తెల్లవారుజామున నాలుగైదు గంటలకు కూరగాయలు తీసుకొస్తారు. విద్యుత్ లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. వీధి దీపాలే దిక్కు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో మధ్యాహ్నం మూడు గంటల వరకు విక్రయించుకుని స్వగ్రామాలకు వెళ్లిపోతున్నారు.

వర్షం వస్తే..

ఇక షెడ్‌ను రేకులతో ఏర్పాటు చేశారు. దీంతో అక్కడక్కడ రేకులకు రంధ్రాలు పడ్డాయి. కొన్ని దుకాణాలపై రేకులు విరిగాయి. వర్షకాలమైతే వర్షపు నీటికి కూరగాయలన్నీ తడవాడాల్సిందే. దాంతో కాయలన్నీ కుళ్లిపోయి విక్రయించేందుకు అవకాశం ఉండేదికాదు. ఇప్పటికే అరకొర బేరాలతో అల్లాడిపోతున్నామని, వర్షకాలంలో మరింతగా నష్టపోతున్నారు. ఎమ్మెల్యేలు పనిచేసిన వారు రైతుబజార్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన వారేనని, ఆచరణలో కార్యరూపం దాల్చలేదు. పదుల సంఖ్యలో ఉపాధి పొందుతున్న దుకాణదారులకు, వందలాది మందికి కూరగాయలు అవసరాలు తీర్చుతున్న బజార్‌ను ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

నాణ్యమైన కూరగాయలు లభ్యం



చిన్నప్పటి నుంచి ఇక్కడ రైతుబజార్ ఉంది. తాజా కూరగాయలు అందుబాటులో ఉంటాయి. బయట దుకాణాల్లో కంటే తక్కువ ధరలకు లభ్యమవుతాయి. సుమారు ఐదారు కిలోమీటర్ల నుంచి వచ్చి కొనుగోలు చేస్తాను. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఇక్కడ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుంది.

– మొహమ్మద్ ఫజులీద్దీన్, సంగడిగుంట

మార్చి 4, 5వ తేదీల్లో స్ఫూర్తి ది ఐ క్యూబ్ ఎక్స్‌పో



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్వీ రమణ, రామకృష్ణమూర్తి, లలిత

గుంటూరు ఎడ్యుకేషన్: పరిశ్రమల అవసరాలకు దీటుగా విద్యార్థులను తయారు చేసేందుకు మార్చి 4, 5వ తేదీల్లో స్ఫూర్తి ది ఐ క్యూబ్ ఎక్స్‌పో– 2025 నిర్వహించనున్నట్లు హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో ఎక్స్‌పో బ్రోచర్లు మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎక్స్‌పో కన్వీనర్ డాక్టర్ కె.లలిత మాట్లాడుతూ విద్యాసంస్థలను, పరిశ్రమలను అనుసంధానం చేసేందుకు నిరంతరం వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. కో–కన్వీనర్ ఎ.బాజీబాబు మాట్లాడుతూ స్ఫూర్తి అనే వినూత్న ఎక్స్‌పోను 2020 నుంచి ప్రతి యేటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ డి. కళ్యాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, వి.అభిలాష్, బి.అనిత, జి.రాజేశ్వరీదేవి, ఎంసీఏ విభాగాధిపతి కె.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శశికళ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ



గుంటూరు రూరల్: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంటితాళాలు పగలగొట్టి ఇంటిలోకి చొరబడి బీరువాను పగలగొట్టి నగలు, నగదు చోరీ చేసిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. సీఐ వంశీధర్ కథనం.. నల్లపాడు గ్రామానికి చెందిన వై.బాలకృష్ణ తన కుమారుడికి ఆరోగ్యం బాగా లేక శనివారం ఇంటికి తాళాలు వేసి భార్య కుమారుడితో కలిసి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వెళ్లారు. అనంతరం సోమవారం అర్ధరాత్రి సమయంలో ఇంటికి వచ్చి చూడగా ఇంటితాళాలు పగలగొట్టి, బీరువాను పగలగొట్టి ఉండటంతో పోలీసులను ఆశ్రయించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీం ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలను సేకరించింది. ఘటనలో రూ.30 వేల నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు(గుంటూరు): 11 కేవీ అమరావతి రోడ్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–2 డీఈఈ ఎన్.గురవయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. భారత్‌పేట, మల్లికార్జునపేట, శ్రీనగర్, అమరావతి రోడ్‌లోని శివాలయం, డొంకరోడ్ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, మల్లికార్జునపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ సంయుక్తంగా జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు వెంగళనగర్‌లోని నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరమాసత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం



నగరంపాలెం: స్థానిక పట్టాభిపురం కంచి కామకోటి పీఠ హరిహర దత్తక్షేత్రంలో శ్రీరమా సత్యనారాయణస్వామి 48వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రమాసత్యనారాయణస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. నిత్య హోమం, బలిహరణ, దీక్షా దంపతులతో లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చనను వేద పండితులు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. సాయంత్రం ఎదురుకోల ఉత్సవం జరిగింది. అనంతరం రమా సత్యనారాయణ స్వామి కల్యాణం నిర్వహించారు. అన్నవరం సత్యదేవుని దేవస్థానానికి చెందిన వేద పండితులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో దంపతులు కల్యాణంలో పాల్గొనగా, స్వామి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ చైర్మన్ చావలి గణపతి, అన్నవరం వీరవెంకటసత్యనారాయణస్వామి ఆలయ ట్రస్ట్ మాజీ డైరెక్టర్ రావిపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో మంగళవారం విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు పూజలు చేశారు. తొమ్మిది మంది వేదపండితులు గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీ గణపతి, చండీ హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్. మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: స్థానిక మాంటిసోరి స్కూల్ వద్ద పార్కింగ్ చేసిన బైక్ చోరీపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీలు తెలిపిన వివరాలు.. కొరిటెపాడుకు చెందిన వలివేటి లక్ష్మీనారాయణ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. జనవరి 26వ తేదీ విజయవాడ వెళ్లే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని మాంటిసోరి స్కూల్ ముందు పార్కింగ్ చేసి వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం 3గంటల సమయంలో వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాలలో, ఆర్టీసీ, బస్టాండ్, రైల్వే స్టేషన్, పార్కింగ్ సెంటర్‌లలో వెతికిన ఎంతకు కనిపించక పోవడంతో దిక్కుతోచక పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.